క్లుప్తంగా

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి

కల్వకుర్తిరూరల్: బీఆర్‌ఎస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ గెలుపునకు కృషి చేయాలని మార్కెట్ చైర్మన్ విజయగౌడ్, వైస్ ఎంపీపీ గోవర్దన్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వేపూరులో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. ప్రతి పక్షం పార్టీల అసత్య ప్రచారాలను తిప్పికొట్టి ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో మనోహర్‌రెడ్డి, కలీల్, బీమయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



వెల్దండ: మండలంలోని కేస్లీతండాలో తుల్జా భవానీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. తండాలో ఏర్పాటు కార్యక్రమంలో మొదటి విజేతకు రూ.20వేలు, రెండో విజేతకు రూ.10వేలు సర్పంచ్ బుజ్జి, బీఎంసీ అధ్యక్షుడు శ్రీనునాయక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మట్టి తవ్వకాలను నిలిపివేయాలి



కల్వకుర్తిరూరల్: మండలంలోని తురుకలపల్లిలో మట్టి తవ్వకాలను నిలిపివేయాలని బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. కొందరు అక్రమార్కులు గుట్టుగా మట్టిని రాత్రివేళ తరలిస్తున్నారని ఆయన వాపోయారు. శుక్రవారం మట్టి తవ్వకాలు జరిపేందుకు సర్వేయర్‌తో కాంట్రాక్టర్ గ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బీసీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి, పలువురు మట్టి తవ్వకాలను అనుమతి పత్రాలు చూయించాలని కోరారు. సమాధానం ఇవ్వకుండా దాటవేసే ప్రయత్నం చేశారు. అక్రమార్కులకు అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని శివప్రసాద్ డిమాండ్ చేశారు.

ఇసుక టిప్పర్ సీజ్

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద శుక్రవారం అనుమతులు లేకుండా అక్రమంగా కల్వకుర్తికి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకొన్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం వంగూర్ మండలం మొల్గర గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మల్లన్న భక్తుల కోసం వైద్య శిబిరం

చారకొండ: దేవీ నవరాత్రులు పురస్కరించుకొని శ్రీశైలం పుణ్య క్షేత్రానికి వచ్చే భక్తులకు మల్లన్న క్షేత్రంలోని పద్మశాలి సత్రంలో మండల కేంద్రానికి చెందిన చిల్వేరు శ్రీనివాసులు సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం సత్రం మేనేజర్ కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ గోవిందరాజు, డాక్టర్ కృష్ణలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. భక్తులకు ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తామని శ్రీనివాసులు పేర్కొన్నారు. పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సత్రం సిబ్బందికి నూతన దుస్తులు అందజేశారు.

మున్సిపల్ సిబ్బందికి రాగిజావ



కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపల్ సిబ్బందికి రాగిజావతో పొడర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్‌కు చెందిన సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సౌజన్యంతో శుక్రవారం పతంజలి యోగాసమితి జిల్లా అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజయ్యలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మన్నెం, నాగరాజు, నాగి, జమీర్, భాస్కర్, జాఫర్ తదితరులున్నారు.



అచ్చంపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దైవచింతనతో ప్రశాంతత

సాక్షి, నెట్‌వర్క్: దైవచింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, ఉమామహేశ్వర దేవస్థాన చైర్మన్ సుధాకర్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా అమ్మవారిని సరస్వతి దేవీగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ దేవాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు అన్నదానం చేశారు. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, అచ్చంపేట రూరల్ పరిధి, వెల్దండ, తాడూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, లింగాలలో దుర్గామాతను సరస్వతిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లాపూర్‌లోని శమీవృక్షం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు.



కల్వకుర్తిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్



పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లిలో



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో..



లింగాలలో



కొల్లాపూర్‌లో



తాడూరు మండలం యాదిరెడ్డిపల్లిలో

పేదల అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు: పేదల అభివృద్ధే సీఎం కేసీఆర్‌ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోనేటిపూర్, తిప్పారెడ్డిపల్లి, గాజర, నిజాంబాద్, ఉమ్మాపూర్ గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు లాంటి ఎన్నో పథకాలను అమలు చేసి పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కృష్ణారెడ్డి, లాలూ యాదవ్, సురేందర్‌రెడ్డి, హమీద్, నరేందర్‌రావు, సర్పంచ్‌లు అంజనేయులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న డీపీఓ కృష్ణ

వెల్దండ: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని డీపీఓ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. తాగు, విద్యుత్ సరఫరా, పరిసరాల పరిశుభ్రత, హరితహారం మొక్కలు, రికార్డులు తదితర అంశాలపై చర్చించారు. గ్రామాలకు క్రీడా సామగ్రి అందించామన్నారు. మైదానాల్లో యువకులకు క్రీడాసామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా నర్సరీలల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. నర్సరీల్లో మట్టి బ్యాగులల్లో ఎంతశాతం ఎర్రమట్టి, మిశ్రమ మట్టి ఉందని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ సునీత, ఈసీ దేవేందర్, తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామసభలు ఏర్పాటు



రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని చర్లిటికాల, తిరుమలాపురం గ్రామాలలో గతంలో జరిగిన పనులకు సంబంధించిన వివరాలు, క్షేత్రస్థాయిలో చేపట్టిన కొలతలు వివిధ పనులకు సంబంధించి పూర్తి వివరాలను గ్రామసభలో వివరించారు. 2022–23 సంవత్సరానికిగాను ఆయా గ్రామాలలో ఎంతవరకు పనులు జరిగాయి పనులకు సంబంధించిన సామగ్రితోపాటు మంజూరైన డబ్బులకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి గ్రామసభలో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీడీఓ గంగామోహన్, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజకీయంగా ముదిరాజ్‌లకు అన్యాయం



మాట్లాడుతున్న మల్లేష్‌ముదిరాజ్

వెల్దండ: రాజకీయ పార్టీలు ముదిరాజ్ కులస్తులకు అన్యాయం చేస్తున్నారని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లకు రాజకీయంగా అన్యాయం చేసిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ముదిరాజ్ ఓటర్లు ఉన్నప్పటికి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లను కేటాయించలేదన్నారు. అధికార పార్టీ ముదిరాజ్ కులస్తులకు ఒక్క ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ముదిరాజ్‌లందరు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఎర్రశ్రీనువాస్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శంకర్‌ముదిరాజ్, కోశాధికారి చంద్రయ్య, యాదయ్య, శేఖర్, పరేషా, శ్యామ్, రమేష్ ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



ఆస్పత్రి ఆవరణలో బతుకమ్మ వేడుకలకు హాజరైన వైద్యులు, సిబ్బంది

కల్వకుర్తి: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్‌బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు రమేష్ అన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు నిర్వహించారు. 50 మంది మహిళలు బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులను అందించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్దన్, జగదీశ్వర్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు ప్రవీన్, కిషన్, శ్రీనివాస్, తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ శివరాంతో పాటుగా ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బంది వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మను అందంగా పేర్చి బొడ్డెమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు.



బహుమతులు అందజేస్తున్న రమేష్‌బాబు

సారా పట్టివేత

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అంజమ్మ నుంచి 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామాల్లో సారా విక్రయించిన, తయారు చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దని పేర్కొన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండా చెందిన కాట్రావత్ లాలు శుక్రవారం కాటన్ బీరు బాటిళ్లు మండల కేంద్రం నుంచి అక్రమంగా తండాకు తరలిస్తున్నాడు. మండల కేంద్రంలో పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

బీఎస్పీతోనే సమన్యాయం



తెలకపల్లి: బీఎస్పీతోనే సమన్యాయం దక్కుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్‌ను ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని దీంతో బహుజన రాజ్యాధికారం సాధ్యమన్నారు.

సీజేఆర్ పార్టీ వీడటం దురదృష్టకరం



కొల్లాపూర్: చింతలపల్లి జగదీశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీని వీడటం దురదృష్టకరమని కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్ల కిందట సీజేఆర్ కాంగ్రెస్‌లో చేరారని పదవుల కోసం పాకులాడారని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలుపుకోసం తాము కృషిచేస్తామన్నారు. నాయకులు నర్సింహా, ఉదయ్‌యాదవ్, శివరాజ్, మౌలాలి, బాబా, వెంకటస్వామి, శేఖర్‌యాదవ్ ఉన్నారు.

రుణమాఫీ చేయాలని నిరసన



బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ: మండలంలోని రైతులందరికీ ప్రభుత్వం రైతు రుణమాఫీ త్వరగా వర్తింపజేయాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నర్సింహారెడ్డి, శంకర్‌గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ వదిలిన బాణం కూచుకుళ్ల రాజేష్

కందనూలు: బీఆర్‌ఎస్ వదిలిన బాణమే నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్ చారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా కొనసాగుతూ...కొడుకు రాజేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేయడంతోనే వారి కుటిల డ్రామాలు ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. విలువలకు తిలోదకాలిచ్చి, భ్రష్టు పట్టిస్తున్న పార్టీలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అని విమర్శించారు. వారి ద్వంద విధానాలు ప్రజలు గమనించారన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మట్టిదొంగ అని, కాంగ్రెస్ అభ్యర్థి కూచుకుళ్ల రాజేశ్వర్ రెడ్డి అవకాశవాది, అసమర్థుడని విమర్శించారు. ఇలాంటి రాజకీయ నాయకులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ టౌన్ అధ్యక్షుడు రాము, జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కుమార్, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మేస్త్రి నరసింహ, టౌన్ సోషల్ మీడియా కన్వీనర్ బొట్టు శీను, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిలీప్ చారి

బీజేపీలో చేరిక

మున్సిపల్ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన 20 మంది యువకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు దిలీప్ చారి సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు యువకులు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి

తాడూరు: మండల కేంద్రం నుంచి గగ్గలపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గగ్గలపల్లి సమీపాన ఉన్న కాజ్‌వే బ్రిడ్జి రక్షణ గోడ ధ్వంసం అయ్యింది. రోడ్డు మలుపులతో ఉండటంతో బ్రిడ్జిపై కల్వర్టు దెబ్బతినడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ప్రయాణికులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. ఆదమరిస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. బ్రిడ్జిపై రక్షణ గోడలు నిర్మించాలని స్థానిక యువకులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గగ్గలపల్లి సమీపంలో దెబ్బతిన్న వంతెన రక్షణగోడలు

బంతిసాగుపై రైతుల ఆసక్తి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో రైతులు బంతిసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతి ఏట రెండు రకాల బంతిపూలను సాగు చేస్తున్నారు. బతుకమ్మతోపాటు దీపావళి, వరలక్ష్మి నోముల పండుగలకు బంతిపూలకు డిమాండ్ ఉంది. మూడు పండుగలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందుజాగ్రత్తగా బంతి పూలసాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సాగు చేశారు. బతుకమ్మ పండుగకు అధికమొత్తంగా పూలను విక్రయించి లాభాలు గడిస్తున్నారు. మండల కేంద్రంతోపాటు మేడిపూరు, అల్లాపూరు, గుంతకోడూరు, చర్లిటిక్యాల వివిధ గ్రామాలలో బంతిసాగు అధికంగా ఉంది.



మేడిపూరులో శివారులో బంతితోట

చెంచుల ఆరోగ్యానికి ఆర్డీటీ రక్ష



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆర్డీటీ ఆస్పత్రి ఎదుట రోగులు(ఫైల్)

మన్ననూర్: చెంచుల ఆరోగ్యం కోసం దశాబ్దం కిందట మన్ననూర్‌లో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. అదేవిధంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ముగ్గురు డాక్టర్లు, నలుగురు ఏఎన్‌ఎంలు, ముగ్గురు మహిళా సిబ్బంది, డ్రైవర్లు, ఒక వాచ్‌మెన్ అందుబాటులో ఉన్నారు. ఇతరులకు కూడా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. చెంచులకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు. ఇదిలా ఉండగా సమీపంలోనే ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నప్పటికి పీహెచ్‌సీకి వచ్చేందుకు రోగులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యంతో పాటూ అతి తక్కువ డబ్బులతో రోగాలు నయం చేస్తుండటంతో చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా రోగులు ప్రతి నిత్యం సుమారు 200 నుంచి 300 వరకు రోగులు వస్తున్నారు. అటవీ లోతట్టు, మారుమూల ప్రాంతాల చెంచులకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌తో పాటు అందుకు సంబంధించిన ఖర్చులు కూడా సంస్థనే భరిస్తూ హైదరాబాద్ తదితర పట్టణాలకు రోగులను తరలించి మెరుగైన వైద్యం కూడా చేయిస్తున్నారు. గ్రామస్తులు, మండల, ఇతర ప్రాంతాల ప్రజలు ఆర్డీటీ సంస్థ చేస్తున్న ఆరోగ్యపరమైన సేవలను ప్రశంసిస్తున్నారు. ప్రత్యేకించి గ్రామస్తులు ఆర్డీటీ ఆస్పత్రి మా గ్రామంలో నెలకొల్పడం అదృష్టంగా భావిస్తున్నామని అంటున్నారు.

మోకాళ్ల నొప్పులకు ప్రత్యేక చికిత్స

మన్ననూర్‌లోని ఆర్డీటీ ఆస్పత్రిలో మోకాళ్ల నొప్పులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. నొప్పులతో బాధపడుతున్న వారు అనేక ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి సైపుల్లా ఖాన్ ఆక్యుపంక్చర్ ద్వారా చేస్తున్న వైద్యం అందిస్తుననారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులకు ఉపశమనం కలగడంతో రోగులకు నమ్మకం పెరిగింది. దీంతో నల్లగొండ, దేవరకొండ, షాద్‌నగర్, పరిగి, మహబూబ్‌నగర్, వనపర్తి తదితర పట్టణాలతో పాటు వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి రోగులు ఆర్డీటీ ఆస్పత్రికి మోకాళ్ల నొప్పుల నుంచి విముక్తి పొందేందుకు ఆస్పత్రికి బారులు తీరుతున్నారు.

మోకాళ్ల నొప్పులు తగ్గాయి

చాలా రోజుల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడ్డా. ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా తగ్గలేదు. ఇక్కడ కొత్తగా ఆక్యుపంక్చర్ ద్వారా చికిత్స అందించారు. కొన్నిరోజులలోనే ఉపశమనం పొందాను. ప్రస్తుతం నడిచేందుకు ఇబ్బంది లేదు.

–శివాజీ, మన్ననూర్

తక్కువ ఖర్చుకే వైద్యం

తక్కువ ఖర్చుకే వైద్యం అందిస్తున్నారు. రూ.100 ల విలువైన ఔషధాలకు రూ.20 కే ఇస్తున్నారు. పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇతర ఆస్పత్రికి వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా తరుచుగా ఇక్కడికే వస్తున్నా.

– జయమ్మ, మన్ననూర్